క్లుప్తంగా

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



పింఛన్ పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప

రాయదుర్గంటౌన్: అర్హులైన పేదలందరికీ సంతృప్తికరస్థాయిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ పొరాళ్ల శిల్ప తెలిపారు. శనివారం ఆమె పట్టణంలోని 2వ వార్డులో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ అర్హత ఉంటే చాలు.. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నామన్నారు. గత టీడీపీ హయాంలో పింఛన్ కోసం తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితులు ఉండేవన్నారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని, అర్హత ఉంటే పింఛన్ మంజూరవుతోందన్నారు. ప్రతిఒక్కరూ సీఎం వైఎస్ జగనన్నకు అండగా ఉండాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 2వ వార్డు ఇన్‌చార్జ్ పొరాళ్ల శివకుమార్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

15 లోపు ఈ–క్రాప్ చేయించుకోండి

కుందుర్పి: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈ నెల 15 లోపు ఈ–క్రాప్ చేయించుకోవాలని వ్యవసాయ అధికారి మహేష్ సూచించారు. శనివారం బెస్తరపల్లిలో వ్యవసాయశాఖ సిబ్బంది చేపడుతున్న ఈ–క్రాప్ నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ–క్రాప్ నమోదులో పూర్తి పారదర్శకత పాటించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీఈఓలు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

పెందోట బాల సాహిత్య పురస్కారం అందజేత



బాలసాహిత్య అవార్డు అందుకుంటున్న శిల్పి చంద్రశేఖర్

బెళుగుప్ప: మండలంలోని వెంకట్రాదిపల్లికి చెందిన శిల్పి చంద్రశేఖర్ పెందోట బాల సాహిత్య పురస్కారం అందుకున్నారు. శనివారం తెలంగాణ రాష్ట్రంలోని సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగిన పెందోట బాల సాహిత్య పురస్కార వేడుకల్లో ఆయనకు అవార్డు అందజేశారు. అతి చిన్న వయస్సులోనే ఆయన మట్టిరెక్కల చందమామ, కాలుతున్న వెన్నెల అనే రెండు పుస్తకాలు రచించడం అభినందనీయని పలువురు కవులు ప్రశంసించారు.

వృద్ధుడికి గాయాలు




గాయపడిన రామాంజనేయులునాయక్

కూడేరు: స్థానిక ఎస్టీ కాలనీ వద్ద శనివారం అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై చోళసముద్రానికి చెందిన వృద్ధుడు రామాంజనేయులునాయక్ రోడ్డు దాటుతుండగా సోము అనే ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టాడు. ఘటనలో వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో క్షతగాత్రున్ని అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. కాగా సోము స్వల్పంగా గాయపడ్డాడు.

కూలీల ఖాతాలకు నగదు జమ

రాయదుర్గం: ఉపాధి కూలీలకు రెండు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న నగదును రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5న ఖాతాలకు జమ చేసిందని రాయదుర్గం క్లస్టర్ ఏపీడీ జయకుమార్ బాబు, గుమ్మఘట్ట ఎంపీడీఓ నరసింహామూర్తి తెలిపారు. వారు శనివారం ఏపీడీ కార్యాలయంలో మాట్లాడారు.. జూలై 18 నుంచి సెప్టెంబర్ 5 వరకు పెండింగ్ కూలీలకు వేతన బకాయిలన్నీ జమ చేశారన్నారు. కూలీలకు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు చెల్లిస్తోందన్నారు.

మండపం పనులు ప్రారంభం



పనులను పర్యవేక్షిస్తున్న గురుస్వామి వెంకటేశులు

కళ్యాణదుర్గం: పట్టణంలోని విద్యానగర్‌లో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయ ఆవరణలో సేవా మండపం పనులు పునః ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం గురుస్వామి వెంకటేశులు పనులను పర్యవేక్షించారు. గతంలో ఇంతకు ముందు ఫంక్షన్ హాలు కింద అన్నదానం కోసం హాలు ఏర్పాటు చేశారు. ఆ హాలుపై సేవా మండపంను నిర్మించనున్నారు. దాతల సహకారంతో నిర్మాణ పనులు త్వరతగతిన పూర్తి చేస్తామని గురుస్వామి తెలిపారు.

ఆలయాల్లో ‘శ్రావణ’ శోభ



రాయదుర్గం: అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుడు



రాయదుర్గం: మురడిలో ఆంజనేయస్వామి మూలవిరాట్



కళ్యాణదుర్గం: ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ నరసింహస్వామి



కుందుర్పి: పూజలందుకుంటున్న అన్నలపురి ఆంజనేయస్వామి



కూడేరు: అలంకరణలో బసాపురం అంజన్న

రాయదుర్గం: నియోజకవర్గంలోని ప్రసిద్ధి చెందిన పలు పుణ్యక్షేత్రాల్లో శ్రావణ శనివారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వెంకటరమణుడి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుడి కి ఉదయం నుంచి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పూలతో అందంగా అలంకరించారు. భక్తులు దర్శన భాగ్యం పొందారు. అలాగే మురడిలో ప్రసిద్ధి చెందిన అంజన్న ఆలయానికి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సతీమణి, జిల్లా రెడ్‌క్రాస్ చైర్‌పర్సన్ కాపు భారతి ఇట్లంపల్లి సమీపాన కొండమీద వెలసిన తిమ్మప్ప స్వామి ఆలయం వరకు కాలినడకతో వెళ్లారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేయించిన తర్వాత అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ధనుంజయ్యరెడ్డి, బేలోడు సర్పంచ్ ఉమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం: శ్రావణ శనివారం కోటవీధిలోని లక్ష్మీ నరసింహస్వామి, గోదాదేవి సమేత వెంకటేశ్వరాలయంలో శ్రావణ మాస పూజలు ప్రత్యేకంగా నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు జరిపారు.అనంతరం స్వామి కి అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

కనుల పండువగా అంజన్న గ్రామోత్సవాలు

కుందుర్పి: కర్ణాటక సరిహద్దున ఉన్న అన్నలపురి ఆంజనేయస్వామి జాతర కనుల పండువగా నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామి గ్రామోత్సవం, వెండిపల్లకి ఉత్సవాలు నేత్ర పర్వంగా సాగాయి. అలాగే వడ్డెపాళ్యం గుడిబండ ఆంజనేయస్వామి, అప్పిలేపల్లి బొబ్బర్లకుంట ఆంజనేయస్వామి ఆలయాల్లో ఉత్సవాలు నిర్వహించారు.

కూడేరు: మండలంలోని బసాపురం ఆంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు దుర్గ చైతన్య మూలవిరాట్‌కు క్షీరాభిషేకం చేసి వివిధ రకాల పట్టు వస్త్రాలు, పుష్పాలతో విశేష అలంకరణ చేశారు.ఆకుల పూజ కట్టారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు.

వైభవంగా జలధి ఉత్సవం..

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో ఆంజనేయస్వామి జలధి శనివారం వైభవంగా నిర్వహించారు. దేవగిరి ఆంజనేయస్వామి కొండపై గంగామాతకు పూజలు నిర్వహించి ఆలయం వరకూ పల్లకీ సేవ, జల్ది బిందె ఊరేగింపు చేపట్టారు. అర్చకులు స్వామికి వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున వచ్చి స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆంజినేయస్వామి ప్రతిమను ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగించారు.

నాగదేవతకుపూజలు..

కణేకల్లు: కణేకల్లులోని బస్టాండ్ ప్రాంతంలో ఉన్న నాగులకట్ట వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నాగదేవతలకు పాలుపోసి, కుంకుమార్చన, మంగళారతులిచ్చి టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఉరవకొండ రోడ్డు యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



రాయదుర్గం: తిమ్మప్పకొండ వద్ద అన్నదానం చేస్తున్న కాపు భారతి



బొమ్మనహాళ్: ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



కణేకల్లు: పూజలందుకుంటున్న నాగదేవతలు

వైభవంగా రథోత్సవం



అభయాంజనేయస్వామి రథోత్సవం ప్రారంభిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మొలకాల్మూరు రోడ్డు చెక్‌పోస్టు వద్ద అభయాంజనేయస్వామి బ్రహ్మ రథోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసం చివరి శనివారాన్ని పురస్కరించుకుని ఆలయంలో విశేష పూజలు చేశారు. ఉదయం 11 గంటలకు మహిళలు, బాలికలు హారతి కళశాలతో మడుగుతేరు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ గావించారు. సాయంత్రం 4 గంటల నుంచి స్వామి బ్రహ్మ రథోత్సవం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు కోదండ సత్యనారాయణ, ఇతర ప్రముఖులు హాజరై పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే పట్టణంలోని ఉక్కడ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణ మాసం శనివారం విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి పల్లకీ ఉత్సవం చేపట్టారు.

శ్రీకృష్ణుడి విగ్రహం ఊరేగింపు



పల్లకీలో శ్రీకృష్ణుడి విగ్రహం ఉరేగిస్తున్న భక్తులు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ప్రధాన రహదారిలో శనివారం శ్రీకృష్ణుడి విగ్రహాన్ని భక్తులు పల్లకిలో ఉరేగించారు. 11రోజుల పాటు జిల్లాలో శ్రీకృష్ణ విగ్రహాన్ని ఊరేగిస్తామని భక్తులు తెలిపారు. శ్రీకృష్ణ మందిరంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రాజీ మార్గానికి వేదిక ‘లోక్ అదాలత్’



రాయదుర్గంటౌన్: కేసులు రాజీ చేస్తున్న ఇన్‌చార్జ్ జడ్జి సుజిన్‌కుమార్, కళ్యాణదుర్గం: మాట్లాడుతున్న జడ్జి సుభాన్, ఉరవకొండ: లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: కక్షిదారులు రాజీమార్గంతో కేసులను పరిష్కరించుకునేందుకు అత్యుత్తమ వేదిక ‘జాతీయ లోక్ అదాలత్’ అని ఇన్‌చార్జ్ జడ్జి జె.సుజిన్‌కుమార్ సూచించారు. శనివారం రాయదుర్గం కోర్టులో ఇన్‌చార్జ్ జడ్జి, మండల న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీకి ఆమోదయోగ్యమైన క్రిమినల్, సివిల్‌తోపాటు ఇతర కేసులకు శాశ్వతంగా పరిష్కారం లభిస్తుందన్నారు. అనంతరం జరిగిన లోక్ అదాలత్‌లో జడ్జి ఆధ్వర్యంలో రాజీమార్గంతో 27 వివిధ రకాల కేసులతోపాటు 1172 ఎస్‌టీసీ (పెట్టి కేసులు)లను పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం: జాతీయ లోక్ అదాలత్‌లో శనివారం 1,526 కేసులు పరిష్కారమైనట్లు జూనియర్ సివిల్ జడ్జి సుభాన్ తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో జడ్జి మాట్లాడారు. ఐపీసీ, ఎస్టీపీ, పీఎల్‌సీ, బ్యాంక్ పీఎల్‌సీ తదితర 1526 కేసులను పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కరణం తిప్పేస్వామి, దేవేంద్ర, ముత్యాలు, దాదాఖలందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ: జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో శనివారం పలు కేసులు పరిష్కారమయ్యాయి. ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గాకళ్యాణి ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో క్రిమినల్ కేసులు–24, బ్యాంకు కేసులు–17, సివిల్–2, పెట్టీ కేసులు–430 పరిష్కరించారు. వీటి ద్వారా మొత్తం రూ.15,56,350 వచ్చింది. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు జయరాజ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నెరవేరిన దశాబ్దాల కల



రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం నుంచి బ్రహ్మసముద్రానికి వెళ్లే ప్రజల దశాబ్దాల కలను రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ నెరవేర్చారు. కళ్యాణదుర్గం నుంచి బ్రహ్మసముద్రం వరకూ బీటీ రోడ్డు నిర్మాణానికి శనివారం మంత్రి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. స్థానిక ఐదుకల్లు రోడ్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతుందన్నారు. ఒక వైపు సంక్షేమ పథకాలను డీబీటీ ద్వారా అందిస్తూనే మరోవైపు అభివృద్ధికి బాటలు వేస్తుందన్నారు. ఈ క్రమంలోనే దశాబ్దాలుగా నిర్మాణానికి నోచుకోని బ్రహ్మసముద్రం రోడ్డుకు మోక్షం కలిగించామన్నారు. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా పట్టించుకోలేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.3.50 కోట్లతో రోడ్డును నిర్మిస్తున్నామన్నారు. రోడ్డు మార్గంలో కళ్యాణదుర్గం నుంచి ఐదుకల్లు, గొంచిరెడ్డిపల్లి మీదుగా బ్రహ్మసముద్రానికి సులభంగా ప్రయాణించే అవకాశం ఉందన్నారు. ఇది శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాల ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పనులను త్వరతగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కేవీ నాగిరెడ్డికి మంత్రి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, డీసీసీబీ డైరెక్టర్ నాగిరెడ్డిపల్లి రామాంజనేయులు, పార్టీ కన్వీనర్లు గోపారం శ్రీనివాసులు, బసవరాజు, బ్రహ్మసముద్రం జెడ్పీటీసీ ప్రభావతి, ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు బిక్కి నాగలక్ష్మి, వన్నూరుస్వామి, సోమనాథ్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, రాంభీమప్ప, ప్రసాద్ రెడ్డి, షేక్షావలి, అప్జల్, కిరీటి యాదవ్, వన్నూరుస్వామి, బిక్కి హరి, పోస్టు క్రిష్ణ, శివ శంకర్ నాయక్, హేమ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు



విద్యార్థులను ఇంటికి పంపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రాయదుర్గంటౌన్: పట్టణంలో ప్రైవేటు స్కూల్ యాజమన్యాలు ఇష్టానురాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. సెలవు రోజుల్లోనూ తరగతులు నిర్వహిస్తూ పిల్లల మానసిక ప్రశాంతను దెబ్బతీస్తున్నాయి. రెండో శనివారం సెలవు రోజు అయినా నిబంధనలకు వ్యతిరేకంగా పట్టణంలోని పలు ప్రైవేటు స్కూళ్లలో తరగతులు నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ తదితరులు యాజమాన్యాలను నిలదీశారు. పట్టణంలోని ఏవీఆర్, ఎస్ఎల్ఎన్, వాణి, సెయింట్ పాల్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూళ్లలో తరగతులను అడ్డుకున్నారు. పర్యవేక్షించి చర్యలు తీసుకోవాల్సిన ఎంఈఓ నాగమణి ఉదాసీనతే ఇందుకు కారణమన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు పాఠశాలలకు వెళ్లి బంద్ చేయించి విద్యార్థులను ఇళ్లకు పంపారు. ఎస్ఎఫ్ఐ నాయకులు హరీష్, కిరణ్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

‘వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి’

బెళుగుప్ప: వినాయక చవితి సందర్భంగా గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేయడానికి అనుమతి తీసుకోవాలని బెళుగుప్ప పోలీసులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అనుమతులు లేకుండా మండపాలు ఏర్పాటు చేసే వారి పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే వినాయక నిమజ్జనంలో డీజే సౌండ్‌తో ఊరేగింపులు నిర్వహించరాదన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కమిటీ సభ్యులు ఈ విషయాలను గమనించాలన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీపీ, సర్పంచ్

ఉరవకొండ(వజ్రకరూరు): వజ్రకరూరు మండలంలోని వెంకటాంపల్లి పెద్ద తండా గ్రామంలో సీసీ రోడ్డుకు శనివారం ఎంపీపీ రమావత్‌దేవి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో చురుగ్గా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి ప్రత్యేక చొరవతో వెంకటాంపల్లి పెద్దతండా రోడ్డును రూ.5 లక్షలతో నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొర్ర శివాజీనాయక్, ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి రమావత్ సామనాయక్, గోపాల్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్.. అన్నదాతలకు సేఫ్..!

- జోరుగా పంటల నమోదు
- ఈ నెల 15తో ముగుస్తున్న గడువు



బీఎన్‌హళ్లి వద్ద ఈ–క్రాప్ నమోదును పరిశీలిస్తున్న అధికారులు

రాయదుర్గం: ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు రైతులు తప్పక ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని, అప్పుడే ప్రభుత్వం నుంచి అందే ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవచ్చని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. పండించిన పంటను దళారుల నుంచి కాపాడుకుని, ప్రభుత్వ కనీస మద్దతు ధర పొందాలంటే పంట నమోదు కీలకమన్నారు. ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో అమలు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని అర్హత కలిగిన ప్రతి రైతూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ సబ్ డివిజన్లలోని 2,09,029 హెక్టార్లు సాధారణం కాగా, 1,46,667 హెక్టార్లలో ఈ ఏడాది ఖరీఫ్ పంటలు సాగులోకి వచ్చాయి. ఇందులో ఇప్పటికే 80 శాతం ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తయినట్టు ఏడీఏలు లక్ష్మానాయక్, యల్లప్ప, పద్మజ తెలిపారు.

ఈ–క్రాప్ తో ప్రయోజనాలెన్నో..

పంటల బీమా, నష్ట పరిహారం చెల్లింపు, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం, అందుబాటులో ఎరువులు, పురుగుమందులు, పెట్టుబడి సాయం అందించడం, వైఎస్సార్ యంత్రసేవా పథకం అమలు, సున్నావడ్డీ, పంట రుణాలు అందించడం, మెట్టలో ఉచిత విద్యుత్, ఉచిత బోర్లు ఇలా ఎన్నో రైతు సంక్షేమానికి రూపొందిన పథకాలు ఈ–క్రాప్ తో ముడిపడి ఉన్నాయి. ఈ–క్రాప్‌లో భాగంగా ఆర్‌బీకే స్థాయిలో ప్రతి రైతు వివరాలు నమోదుకు శ్రీకారం చుట్టారు. దీని వల్ల పంట విక్రయించే సమయంలో రైతులకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా మూడేళ్లుగా పంటల బీమాను రైతుల ఖాతాల్లోకే జమ చేస్తున్నారు.

ఈ నెల 15 తో గడువు ముగింపు

ఈ–క్రాప్ నమోదుకు సెప్టెంబర్ 15 ఆఖరి తేదీగా నిర్ధారించారు. ఈ లోపు పంటల నమోదు తప్పనిసరిగా పూర్తిచేయాలి. రైతులు మేల్కొక పోతే ఎన్నో విధాలుగా నష్టపోవాల్సి వస్తోంది. దూరప్రాంతాల్లో ఉండే రైతులు ఈ విషయాన్ని గుర్తించి ఆర్‌బీకేల్లోని సిబ్బందిని సంప్రదించి ఈ–క్రాప్ నమోదు చేయించుకునే బాధ్యత తీసుకోవాలి.

ఈ–క్రాప్‌తో ఎన్నో ప్రయోజనాలు



సాగుచేసిన పంటలన్నీ ఈ–క్రాప్ లో నమోదు చేయించుకోవాలి. దళారుల చేతుల్లో రైతులు మోసపోకుండా ఉండాలంటే ఈ–క్రాప్ ఉండాలనే విషయం గుర్తించుకోవాలి. అలాగే ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటకు నష్టం జరిగితే ప్రభుత్వం తక్షణ పరిహారం అందిస్తుంది. రైతులు ఈ విషయం పట్ల అప్రమత్తంగా ఉండి నమోదు ప్రక్రియ పూర్తి చేయించుకోవాలి.

– ఉమామహేశ్వరమ్మ, డీఏఓ, అనంతపురం

అర్హులు నష్టపోకూడదు



ఈ–క్రాప్ నమోదు విషయంలో అధికారులు మరింత జాగ్రత్త వహించాలి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కూడా ఈ విషయం పై చిత్తశుద్ధితో ఆలోచిస్తూ రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారు. గత టీడీపీ హయంలాగా రైతులను వంచనకు గురిచేసే సిద్ధాంతం తమ ప్రభుత్వానికి లేదు. జాబితా ఆధారంగా ఆర్‌బీకే సిబ్బంది పరిశీలించి రైతులను అప్రమత్తం చేయాలి.

– కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

చావడిలోకి దూసుకెళ్లిన వాహనం

శెట్టూరు: మండలంలోని తిప్పనపల్లిలో బొలెరో వాహనం చావడిలోకి దూసుకెళ్లింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం కర్ణాటక నుంచి తిప్పనపల్లి మీదుగా బెల్లంతో వస్తున్న బొలెరో వాహనం తిప్పనపల్లి గ్రామ నడిబొడ్డున ఉన్న ప్రధాన మలుపు వద్ద డ్రైవర్ అదుపు చేయలేక ఎదురుగా ఉన్న చావడిలోకి దూసుకెళ్లింది. చావడిలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. చావడి పాక్షికంగా దెబ్బతిన్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు మరమ్మతు చేపట్టండి

కూడేరు: మండలంలోని జల్లిపల్లిలో పీఏబీఆర్ డ్యాంకు వెళ్లే రోడ్డు బస్టాండ్ నుంచి గ్రామం చివరి వరకు గుంతలు పడి అధ్వానంగా ఉంది. వర్షం వస్తే నీరు అందులో చేరడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.